ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.2 । కనిష్ఠం 21.6
కామారెడ్డి జిల్లా వార్తలు
5
మంగళవారం 20 ఆగస్టు 2024

మద్యం తాగి డయల్ 100కి కాల్ చేసిన వ్యక్తి బైండోవర్

మాచారెడ్డి, ఆగస్టు 19: మాచారెడ్డి మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన చందు అనే వ్యక్తిని సోమవారం తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు మాచారెడ్డి ఎస్ఐ అనిల్ తెలిపారు. మద్యం తాగి డయల్ 100కి కాల్‌చేసి ప్రతీసారి దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. డయల్ 100 కేవలం అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించాలని వారు సూచించారు.



రుణమాఫీపై.. ఫిర్యాదుల వెల్లువ!

కామారెడ్డి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ చేసింది. అయితే చాలా మంది అర్హులైన రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటు జిల్లా వ్యవసాయశాఖాధికారులకు అటు బ్యాంకులకు రైతులు బారులు తీరుతూ మాఫీ కాలేదని ఫిర్యాదులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియను నెల రోజుల్లో మూడు విడతలుగా చేపట్టింది. ఈ నెల రోజుల్లో సుమారు 8వేల వరకు రుణమాఫీకై ఫిర్యాదులు వచ్చినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ఇటీవల మూడో విడత ప్రక్రియ పూర్తి చేసినందున రుణాలు ఎవరికైతే మాఫీ కాలేదో అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం మండలాల వారీగా వ్యవసాయ అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించి ఫిర్యాదులు స్వీకరించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రుణమాఫీ కాగా ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.655.37 కోట్ల నిధులను విడుదల చేసింది.



నెల రోజులుగా మాఫీ ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించగా అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి హామీలను నెరవేర్చారు. మూడు విడుతల్లో అర్హులైన రైతులకు రుణమాఫీ చేసి నిధులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రుణమాఫీ చేయగా రూ.655.37 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ ప్రక్రియను నెల రోజులుగా చేపట్టింది. జూలై 18న రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి మొదటి విడతలో రూ.1లక్ష వరకు రుణాలు తీసుకున్న 49,540 మంది రైతులకు మాఫీ చేయగా రూ.231.13కోట్ల నిధులను విడుదల చేసింది. జూలై 30న రెండో విడతలో రూ.1.50లక్షల వరకు రుణాలు తీసుకున్న 24,816 మంది రైతులకు మాఫీ చేసింది. ఇందుకుగాను రూ.211.72 కోట్ల నిధులను విడుదల చేసింది. ఆగస్టు 15న మూడో విడతలో రూ.2లక్షల మేర రుణాలు తీసుకున్న 17,543 మంది రైతులకు మాఫీ చేయగా ఇందుకుగాను రూ.212.50 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న అర్హులైన రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ వర్తింపజేసింది.

- జిల్లాలో ఇప్పటి వరకు 8 వేలకు పైగా ఫిర్యాదులు
- ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏవో, ఏఈవోలకు బాధ్యత
- జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రుణమాఫీ
- రూ.655.37 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- రుణాలు మాఫీ కాలేదంటూ చాలా మంది రైతుల్లో ఆందోళన
- అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న రైతులు

మాఫీ కాలేదని రైతుల్లో ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియను మూడు విడతల్లో చేపట్టింది. అయితే జిల్లాలో సుమారు రూ.1లక్ష 50వేల మందికి పైగా రుణాలు తీసుకున్న అర్హులైన రైతులు ఉన్నప్పటికీ జిల్లాలో 91 వేల మంది రైతులకు మాఫీ జరిగింది. చాలా మంది రైతులు మాఫీకి అర్హులైనప్పటికీ జాబితాలో పేర్లు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదటి రెండు విడతల్లో రేషన్‌కార్డులు లేవని పట్టాపాసుబుక్‌లు లేవని పేర్లు తప్పుగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని చెప్పి దాటవేశారు. తీరా మూడో విడత రుణమాఫీ వచ్చేసరికి రూ.2లక్షల కంటే పైన ఉన్నాయని పొంతన లేని సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణాలు మాఫీ కాకపోవడంతో పలుచోట్ల రైతులు బ్యాంకుల వద్ద నిరసన తెలుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని మాఫీ పేరిట రైతులను మోసం చేశారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మరో వైపు రుణాలు మాఫీ కాని అర్హులై ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకుంటే మాఫీ చేస్తామని ప్రభుత్వ ప్రతినిధులు అధికారులు చెబుతున్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులు

జిల్లా వ్యాప్తంగా రైతులు ఇచ్చిన ఫిర్యాదులు అధికారులు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో ప్రక్రియ పూర్తయినందున రుణమాఫీకి 8వేల ఫిర్యాదులు వచ్చినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇటీవల మూడో విడత రుణమాఫీ జాబితాను విడుదల చేసినందున మరిన్ని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మండలాల వారీగా ఫిర్యాదులు స్వీకరించేందుకు వ్యవసాయాశాఖాధికారులు ఫిర్యాదుల సెల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ ఫిర్యాదులను ఆయా మండల వ్యవసాయాధికారులు పర్యవేక్షించనున్నారు. దోమకొండ రైతువేదికలో ఏవో సుప్రజ్యోతి, కామారెడ్డి ఏఎంసీలో ఏవో పవన్, భిక్కనూర్ రైతు వేదికలో ఏవో రాధ, బీబీపేట రైతువేదికలో ఏవో నరేంద్ర, రాజంపేట రైతువేదికలో ఏవో సునీతారాణి, పల్వంచ మండలం పరీదిపేట రైతువేదికలో ఏవో శ్రీనివాస్‌రావు, మాచారెడ్డి మండలం లచ్చపేట రైతువేదికలో ఏఈవో సౌజన్య, లింగంపేట రైతువేదికలో ఏవో అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి రైతువేదికలో ఏఈవో రాజగౌడ్, సదాశివనగర్ రైతువేదికలో ప్రజాపతి, రామారెడ్డి రైతువేదికలో ఏఈవో రాకేష్, గాంధారి రైతువేదికలో నరేష్, తాడ్వాయి రైతువేదికలో నర్సింలు, పెద్దకొడప్‌గల్ రైతువేదికలో ఏవో కిషన్, నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట రైతువేదికలో ఏవో హరివెంకటప్రసాద్, జుక్కల్ రైతువేదికలో ఏవో పండరి, పిట్లం రైతువేదికలో ఏవో కమల, నిజాంసాగర్ రైతువేదికలో ఏవో అమర్‌ప్రసాద్, మహ్మద్‌నగర్ రైతువేదికలో ఏఈవో మధుసూదన్, మద్నూర్ రైతువేదికలో ఏవో రాజు, డోంగ్లీ పీఏసీఎస్‌లో ఏఈవో బస్వరాజ్, బిచ్కుంద రైతువేదికలో ఏవో రాజలింగం, బాన్సువాడ మార్కెట్ కమిటీలోని ఏడీ కార్యాలయంలో ఏవో నదిమోద్దీన్, నస్రూల్లాబాద్ రైతువేదికలో ఏవో భూపాల్, బీర్కూర్ రైతువేదికలో ఏవో మీనాలు ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

జిల్లాలో ఘనంగా రాఖీ పండుగ

• సోదరులకు రాఖీలు కట్టిన సోదరీమణులు


కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 31: కామారెడ్డి జిల్లాలో సోమవారం ఘనంగా రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. ఉదయమే తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించిన తోబుట్టువులు తమ తమ్ముళ్లకు, అన్నలకు రాఖీలు కట్టి స్వీట్లు అందజేసి పండుగ శుభాకాంక్షలను తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు డివిజన్‌లోని ఆయా మండలాలు, గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘన ంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఆల యాల్లో, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదమ్ములకు అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి స్వీట్లు పంచారు. రాఖీ పండుగ సందర్భంగా తోబుట్టువులు తమ అన్నద మ్ములకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం కట్న కానుకలను సోదరీ మ ణు లు అందుకున్నారు. కాగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో తన సోదరునికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు వారి సోదరీమణులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ ఆమె సోదరుడు బాలాజీరావుకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల అనుబం ధానికి ప్రతీక రక్షాబంధన్ అని అన్నారు. దేశ సంస్కృతి, జీవన తాత్వికతకు రాఖీ పండుగ వేదికని, ఏటా శ్రావణ మాస ంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పండువగా జరుపుకుం టామని తెలిపారు. రాఖీ కట్టడం ద్వారా తమకు రక్షణగా ని ల ు స్తా ర ని సోదరీమణులు ఆకాంక్షిస్తారని అన్నారు. మానవ సంబంధాలు, కుటుంబ అనుబంధాలు మరి ంత బలపడుతాయని రక్త సంబంధా ల్లోని ఔన్నత్యం కనబడుతుందని తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరీమణులు


హైదరాబాద్‌లో తన సోదరునికి రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్


తన సోదరునికి రాఖీ కడుతున్న టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్

రుణమాఫీపై ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 19: జిల్లాలోని 25 మండలాల్లో రుణమాఫీపై ఫిర్యాదుల విభాగాల ఏర్పాటుతో పాటు ఆయా మండల ఏవో, ఏఈవోలకు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర్వులకు అనుగుణంగా తమ మండలాల్లోని బ్యాంకుల్లో క్రాప్‌లోను తీసుకున్న రైతుల నుంచి ఉద యం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రుణమాఫీపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని సూచించారు. అదేవిధంగా రోజువారి నివేదికను 4 గంటలలోపు సమర్పించాలని సూచించారు. సూచించిన ప్రొఫార్మాలో సంబంధిత మండలంలో ఉన్న అన్ని బ్యాంక్ బ్రాంచ్‌ల యొక్క సీఎల్‌డబ్ల్యుఖాతాలకు నియమించబడిన మండల ఏవో, ఏఈవోలు బాధ్యత వహిస్తారని తెలిపారు. ఫిర్యాదుల కోసం రిజిస్టర్‌లో నమోదు చేస్తూ గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులతో ఎవరు కూడా పరుష పదజాలం ఉపయోగించవద్దని, రుణమాఫీలో ఏదైన సందేహాలు ఉంటే సానుకూలంగా వ్యవహరించి నివృత్తి చేయాలని తెలిపారు.

నేటి నుంచి ఓటరు జాబితా సవరణ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 19: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణపై తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వేను పకడ్బందీగా చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2024లో భాగంగా ఓటరు జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఎక్కడికైన వెళ్లిపోయారా, చనిపోయారా, పేర్లలో తప్పులు ఉన్నాయా అనే అంశాలను బీఎల్‌వోలు తెలుసుకునే విధంగా చూడాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండి ఓటరు జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరఖాస్తు స్వీకరించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా ముసాయిదాను అక్టోబరు 29న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబరు 10 వరకు ఇంటింటా సర్వే పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 1500 మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఒక కుటుంబం మొత్తం సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని తెలిపారు. సర్వే చేసిన ప్రతీ ఇంటికి స్టిక్కర్ అతికించాలని తెలిపారు. మృతిచెందిన వారి పేర్లు తొలగించడానికి కుటుంబ సభ్యులకు నోటీస్ అందజేయాలని తెలిపారు. మృతి చెందిన వారి డెత్ సర్టిఫికెట్ నకలు తీసుకుని పేరును తొలగించాలని తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు ఆధార్ నెంబర్, పదో తరగతి మార్కుల జాబితా ఆధారంగా 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు లేని వారు ఫారం-6లో బీఎల్‌వోకు అందజేసి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండల స్థాయిలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్‌లు సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. వారి అభిప్రాయాలు తీసుకుని, అందరి జాబితా తయారీకి అందరి సహకారం ఉండేలా చూడాలని తెలిపారు. వీఐపీ ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు ఓటరు జాబితాల్లో ఉండే విధంగా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్‌డీవో ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలి

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలోని వసతి గృహాలను మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వసతి గృహాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేవిధంగా చూడాలని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మె బాటలో ఆరోగ్య మిత్రలు


ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

- వేతనాల పెంపు ఉద్యోగ భద్రతకు డిమాండ్
- జిల్లాలో 26 మంది ఆరోగ్య మిత్రలు
- ఆరోగ్యశ్రీ సేవలకు తప్పని ఆటంకం

ఎల్లారెడ్డి, ఆగస్టు 19: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పని చేస్తున్న ఆరోగ్యమిత్రలు మంగళవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని వారు ఈనెల 6న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులకు నోటీసులు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య మిత్రలు కొన్ని నెలలుగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో సచివాలయ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కానీ ఇప్పటి వరకు స్పందన లేకపోవడంతో వారంతా సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

వారి డిమాండ్లు ఇవే..

ఆరోగ్యశ్రీ పథకంలో కింద 16ఏళ్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డీపీవో క్యాడర్ కల్పించాలని జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని విధి నిర్వహణలో మరణిస్తే రూ.50లక్షల ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని హెల్త్‌కార్డులు ఇవ్వాలని షిఫ్టింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్లతో ఆరోగ్యమిత్ర ఉద్యోగులు సమ్మెకు వెళ్లనున్నారు.

జిల్లాలో 26 మంది ఆరోగ్య మిత్రలు

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 26 మంది ఆరోగ్యమిత్రలు పని చేస్తున్నారు. వీరంతా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఆరోగ్యశ్రీ ఎంపానల్డ్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్య మిత్రలుగా పని చేస్తున్నారు.

కొనసాగుతున్న జూడాల నిరసనలు

పెద్దబజార్, ఆగస్టు 19: ప్రభుత్వ వైద్యకళాశాలలు, ఆసుపత్రులలో డ్యూటీ డాక్టర్లకు సరైన డ్యూటీ రూమ్‌లు, వాష్‌రూమ్‌లను అందించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ఓపీ సేవలు, ఎంపిక చేసిన వార్డులు, శస్త్రచికిత్సలను బహిష్కరిస్తూ ఆరో రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఆర్జికర్ మెడికల్ కళాశాల బాధిత మహిళలకు న్యాయం జరగాలన్నారు. సీబీఐ విచారణ, సుప్రీంకోర్టు నుం చి ఫాస్ట్‌ట్రాక్ న్యాయం జరగాలని కేంద్ర రక్షణ చట్టం యొక్క అత్యవసర అమలు చేయాలని ఆసుపత్రిలలో అవసరమైన ప్రాంతాల్లో సిసిటివి ఏ ర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, ఆసుపత్రులలో స్పె షల్ బలగాలతో భద్రత సిబ్బందిని పెంచాలన్నారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళల ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం మహిళా భద్రత విభాగాన్ని సృష్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడా జిల్లా అధ్యక్షుడు జితిన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న జూడాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా అధికారులు చొరవ చూపాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు19: జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణాల మాఫీ కింద లబ్ధి చేకూరేలాగా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్ అన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సోమవారం సాయంత్రం మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే మూడువిడతల్లో రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందని ఆయన అన్నారు. సాంకేతిక కారణాలతో అర్హులైన వారికి రుణమాఫీ జరగకుంటే కారణాలు పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో రుణమాఫీపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తనదృష్టికి వెంటనే తీసుకురావాలని ఆయన అన్నారు. రైతులకు రుణమాఫీ వర్తించే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. రైతులు ఫిర్యాదులు చేస్తే స్పందించకుండా ఉండవద్దని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి రుణమాఫీ అయ్యే విధంగా చూడాలన్నారు.

20 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలి..

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల 20నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వేచేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఓటరు జాబితా ప్రకారం ప్రతీ ఓటరు వివరాలను పరిశీలించాలన్నారు. ఈ మేరకు బీఎల్‌వోలకు పూర్తి అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు, మృతిచెందారా వంటి అంశాలు ఉంటే నోట్ చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నాయా పరిశీలించి ఫోటో స్పష్టంగా ఉందో లేదో చూడాలన్నారు. ఈ ఓటరు జాబితా ఆధారంగానే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నందున పూర్తిస్థాలో పరిశీలించాలని కోరారు. మండలాల పరిధిలో ధరణి పెండింగ్ దరఖాస్తులను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, అధికారులు ఉన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఆగస్టు19: శ్రావణమాసం మూడవ సోమవారం పౌర్ణమి సందర్భంగా సిద్దులగుట్టపై భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతలతో అభిషేకంచేశారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి కుటుంబసమేతంగా విచ్చేసి శివాలయం, రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు, ఆర్మూర్ భజనమండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భక్తిశ్రద్దలతో పాడారు. భక్తులందరికీ ఆలయకమిటీ వారు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, జిమ్మి రవి, చెందేసి శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, అజరీ సతీష్, బోండ్ల ఆనంద్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బుద్దె రాజేశ్వర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బోధన్ రూరల్, ఆగస్టు 19: సాలూర మండలకేంద్రంలో సోమవారం ఉద్యమ నాయకుడు, సీనియర్ రాజకీయ నాయకులు బుద్దె రాజేశ్వర్ విగ్రహ ఏర్పాటుకు వివిధపార్టీల నాయకులు సోమవారం సాలూర గ్రామంలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ బుద్దె రాజేశ్వర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాలమరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులతో పాటు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలకు గీతకార్మికులు సిద్ధంగా ఉండాలి'

పెద్దబజార్, ఆగస్టు19: సమస్యలపై పోరాడేందుకు గౌడ, గీత కార్మికులు సిద్ధంగా ఉండాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారుడు పెద్దివెంకట్రాములు అన్నారు. సోమవారం నగరంలోని నాందేవ్‌వాడలోగల కార్మిక భవన్‌లో అమరుల యాదిలో గౌడ గీతన్న చైతన్య యాత్రను జయప్రదం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి సర్వాయి పాపన్న 374 జయంతి 18వ తేదీ వరకు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అమరుల యాదిలో గౌడ గీతన్న చైతన్య యాత్ర నిర్వహించాలన్నారు. గీత వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అమరులను స్ఫూర్తిగా తీసుకొని సర్వాయి పాపన్న పోరాట దక్షితను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో పోరాటమే మార్గం అంటూ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు కొయ్యాడి నర్సింలుగౌడ్, శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వేల్పూర్ గ్రామీణ రోడ్లకు సంతరించుకున్న కొత్త శోభ



వెంకటాపూర్ - కోమన్‌పల్లి, కుకునూర్ మీదుగా నిర్మించిన బీటీ రోడ్డు



మోతె నుంచి అక్లూర్ మీదుగా నిర్మించిన బీటీ డబుల్‌రోడ్డు



జాన్కంపేట్ - సాహెబ్‌పేట్ మీదుగా వేల్పూర్‌కు నిర్మించిన బీటీ

వేల్పూర్, ఆగస్టు19: ఏళ్ళ తరబడి మరమ్మతులకు నోచుకోలేక గుంతలు, కంకరరాళ్లు తేలి వాహనదారులతో పాటు పాదచారులు నడవలేనంతగా మారిన వేల్పూర్ మండల గ్రామాల్లో రోడ్లు వివిధ పథకాల నిధులతో కొత్త శోభను సంతరించుకున్నాయి. వర్షాకాలంతో సమయాల్లో కూడా రోడ్లపై వెళ్లాలంటే నరక ప్రాయాంగా ప్రయాణించే గ్రామీణులు వి విధ పథకాల పుణ్యమ అంటూ బీటీడబుల్ రోడ్డుగా రూపుమారాయి. ప్రస్తుతం ఈరోడ్లపై ఉల్లాసంగా ప్రజలు ప్రయాణిస్తున్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఇతర పథకాలకు చెందిన కోట్లాది నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లుగా మారిప్రజల ప్రయాణానికి సౌకర్యంగా తయారయ్యాయి. ఎమ్మెల్యేప్రశాంత్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పట్టుదలతో బాల్కొండ నియోజక వర్గంలోని మారుమూల గ్రామాలను సైతం అన్ని మండలాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మించారు. అందులో భాగంగా వేల్పూర్ మండలంలోని సీఆర్ఎఫ్ నిధులు రూ.36కోట్లతో జాన్కంపేట్, సాహెబ్‌పేట్, వేల్పూర్ మీదుగా వెంకటాపూర్, కోమ న్‌పల్లి, కుకునూర్ నుంచి అంక్సాపూర్ వరకు 63వ జాతీ యరహదారిని కలుపుతూ బీటీడబుల్ రోడ్డు నిర్మించారు.ప్లాన్‌వర్క్ నిధులు రూ.6కోట్ల 60 లక్షలతో మోతె నుంచి అక్లూర్ మీదుగా బడాభీంగల్ రోడ్డుకు కలుపుతూ బీటీడబులరోడ్డు నిర్మించారు.పీఆర్‌నిధులతో పచ్చలనడ్కుడ నుంచి అక్లూర్ బీటీరోడ్డు నిర్మించారు.వేల్పూర్ వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి అమీనాపూర్ గ్రామానికి బీటీరోడ్డు నిర్మించారు. ఈ రోడ్ల నిర్మాణం కావడంతో గ్రామీణ రోడ్లకు కొత్తకళ సంతరించుకుంది.దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు హ ర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఎస్సీసబ్‌ప్లాన్ ద్వారా రూ.5 కోట్ల88లక్షల నిధులతో పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్‌కు బీటీ డబుల్‌రోడ్డు ప నులు చురుకుగా సాగుతున్నాయి, రూ.4 కోట్ల 20లక్షల నిధులతో పచ్చల నడ్కుడ నుంచి వాడి గ్రామానికి సింగిల్ లైన్ రోడ్డును డబుల్ లైన్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.రూ.9కోట్లనిధులతో పచ్చలనడ్కుడనుంచికొత్త పలి (ఎన్)మీదుగా చింతలూర్ వరకుడబుల్ బీటీరోడ్డుపనులు నడుస్తున్నాయి.

'న్యాయవాదిపై చేయి చేసుకున్న పోలీసులను సస్పెండ్ చేయాలి'



బోధన్‌లోలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బోధన్‌రూరల్,ఆగస్టు19: బోధన్ కోర్టు న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఆదివారం కూకట్‌పల్లి కోర్టు న్యాయవాది సంతోష్‌పై పోలీసులు ఒక కేసులో చేయి చేసుకుని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని బోధన్ బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. న్యాయవాది సంతోష్‌పై దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంత్ రావు, సంగ్రామ్, ఈశ్వర్, కోర్టు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

● విధుల నుంచి ఎస్సై జమాల్‌ను తొలగించాలి..

ఆర్మూర్‌టౌన్: బోర్‌బండ ఎస్సై జమాల్‌ను తక్షణమే సర్వీస్ ఉంచి తొలగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయ వాది సంతోష్‌పై బోర్‌బండ ఎస్సై జమాల్ దాడి చేయడం సరియైన పద్ధతి కాదని, వరుసగా న్యాయవాదులపై పోలీసులు దురుసుగా మాట్లాడుతూ దాడు లు చేస్తున్నారని, తక్షణమే ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యా యవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. అంతకు ముందు న్యాయవాదికి దాడికి నిరసనగా న్యాయవాదులువిధులను బహిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్, సురేష్, పండిత్, శ్రీధర్, తులసీదాస్‌క్రాంతి, జీజీ.రాం, ప్రవీన్, జగన్, రాజేశ్వర్, అశోక్, గణేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ డే



ఫొటోగ్రాఫర్లను సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు19: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫోటోగ్రాఫీ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్‌లు పటిలివంటి రమేష్, చావెల్ బాల్‌రాం, దమ్మాయి శివలను పటుశాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, కార్యదర్శి మ్యాక శ్రీకాంత్, కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు రఫీయొద్దిన్, వెంకట్రాంరెడ్డి, ద్యాగ ఉదయ్, అంబాల్ల తిరుపతి, శ్రీధర్, చంద్రశేఖర్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

● జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫోటోగ్రాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఫొటోగ్రాఫర్‌లను సన్మానించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్స్ ఉమాపతి, రాజేష్‌లను పట్టుశాలువతో సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్, ఫౌండేషన్ ప్రతినిధి విశ్వనాథ్ రంగా, తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో పూర్తిస్థాయి రుణమాఫీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వేల్పూర్,ఆగస్టు19:మండలంలోని పచ్చలనడ్కుడలో పూర్తి స్థాయి రుణమాఫీ పై విధివిధానాలపై రైతులకు సోమవారం వ్యవసాయాధికారితో పాటు కాంగ్రెస్ నాయకులు అవగాహన కల్పించారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిల ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కురి గంగాధర్ ఆధ్వర్యంలో ఏఈవో వినయ్‌ని గ్రామానికి పిలిపించి రైతులకు రుణమాఫీపై అవగాహన కల్పించారు. రుణమాఫీ కానివారు అధైర్యపడవద్దని సూచించారు. ఇక్కడికి వచ్చిన రైతులకు రుణమాఫీపై వారి ఆధార్‌కార్డు ద్వారా కొన్ని వివ రాలను వివరించారు. రుణమాఫీపై, ఇతర ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కురి గంగాధర్, కొన్ని సాంకేతిక లోపలతో కొంత మందికి రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే సాంకేతిక లోపాలను సరిచేసి రైతులందరికి రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జల్ల భూమన్న, పోగుల గంగాధర్, న్యాయం రమేష్, రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ కార్య కర్తలు, ఉన్నారు.

● షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

జక్రాన్‌పల్లి: ఏకకాలంలో షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని రైతులు తెలిపారు. సోమవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో ఈనెల 24న ఉదయం 10గంటలకు మైత్రి కళ్యాణ మండపంలో రైతులు సమావేశం కానున్నట్లు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశానికి ప్రతీ ఇంటి నుంచి రైతులు హాజరుకావాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రైతు ఐకాస, రైతులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో సమావేశమైన రైతు ఐకాసా సభ్యులు

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్, ఆగస్టు 19: అర్సపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సిజిఆర్ఎఫ్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు టౌన్-1 ఏడిఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు వినియోగదారులు తమ సమస్యలను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, ఫోర్త్‌మెంబర్ రాజాగౌడ్ రానున్నారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళం

నవీపేట,ఆగస్టు19: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయం అభివృద్ధికి మాజీ సర్పంచ్ సరిన్ 26,116రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేష్, స్వామి, రాజేశ్వర్, సుధాకర్, మోహన్, నవీన్ తదితరులున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఆందోళన

రుద్రూరు, ఆగస్టు 19:రుద్రూరు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో ఇళ్లు లేని నిరుపేదలు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కబ్జాకు పాల్పడ్డారు. ఎంత మంది నాయకులకు చెప్పిన అధికారులకు చెప్పిన తమ బాధను పట్టించుకోవడం లేదని నిరుపేదలు స్వతహాగా డబుల్ బెడ్ రూమ్‌ల కబ్జాకు పాల్పడ్డారు. డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి సంవత్సరం అయినా పేద వారికి డబుల్ బెడ్ రూమ్‌లు అందజేయడం లేదని జేఎన్‌సీ కాలనీ నిరుపేదలు ఇష్టం వచ్చినోళ్ళు ఇష్టం వచ్చిన డబుల్ బెడ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. డబుల్ బెడ్ రూమ్ బయట ఆధార్ కార్డులు పెట్టి ఇళ్ళపైన పేర్లు రాయించుకుంటున్నారు. నాయకులు ఇచ్చేది ఎప్పుడో మేము తీసుకునేది ఎప్పుడో అనే విధంగా ఉందని అందుకే తామే స్వతహాగా వచ్చి కబ్జా చేశామని జేఎన్‌సీ కాలనీ వాసులు తెలిపారు. అనంతరం అనంతరం తహసీల్దార్ వెంకటేశం, సీఐ జయేష్‌రెడ్డి, ఏఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది, మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్‌లు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అర్హులైన ప్రతి నిరుపేదకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేస్తామని వారిని సముదాయించారు. దీంతో నిరుపేదలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

బోధన్ రూరల్, ఆగస్టు 19 : రుద్రూర్ మండల కేంద్రంలో 11-11-2023న తండ్రిని చంపిన తనయుడి కేసులో కొడుకు నక్క సాయిలుకు బోధన్ 5వ అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్ జీవితఖైదు విధిస్తూ తీర్పును వెల్లడించారని కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రుద్రూర్ మండల కేంద్రంలో 11-11-2023నాడు రాత్రి సమయంలో తండ్రి నక్క చిన్న పోశెట్టి కొడుకు నక్క సాయిలుకు గొడవ జరుగగా కొడుకు నక్క సాయిలు తండ్రిని కొట్టి గొంతు పిసికి చంపాడని వివరించారు. అనంతరం స్వచ్ఛందంగా లొంగిపోవడంతో కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితుడు నక్కసాయిలు తండ్రిని చంపిన కేసును ఒప్పుకున్నందున 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్ జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని, వెయ్యి రూపాయలు చెల్లించని పక్షంలో మరో రెండు సంవత్సరాలు జైలులో సాధారణ జీవితం గడపాలని తీర్పులో వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరజ్, సీఐ జయేష్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడికి..

బోధన్‌రూరల్, ఆగస్టు 19 : రెంజల్ మండలం నీలా గ్రామంలో 17-7-2019నాడు అన్నను కక్షపూరితంగా చంపిన కలీం ఖురేషిని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ జీవిత ఖైదీతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించినట్లు కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నీలా గ్రామంలో నివాసం ఉంటున్న కలీం ఖురేషి అనే వ్యక్తి తన అన్న సలీంపై కక్ష పెంచుకుని 14-07-2019లో రాత్రిపూట కత్తితో కడుపులో పొడవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కేసు పూర్వపరాలు పరిశీలించగా కలీం ఖురేషి నేరం ఒప్పుకున్నందున సోమవారం అన్నను చంపిన తమ్ముడు కేసులో జీవిత ఖైదు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారన్నారు. వెయ్యి రూపాయలు కట్టని యెడల రెండు సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, రెంజల్ ఎస్ఐ సాయన్న, రూరల్ సీఐ కోలా నరేష్, రాములు, మనోహర్, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

తగిలేపల్లిలో అన్నదానం

వర్ని,ఆగస్టు19: వర్ని మండలం తగిలేపల్లి గ్రామ పరిధిలోని రూప్లానాయక్ తండాలో సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది అయ్యమఠం ఆలయం వద్ద శ్రావణ మాసం సందర్భంగా గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గుజ్జ శంకర్, బక్క రాములు, తొంట కేశవ్, గుజ్జ అశోక్, భజన మండలి సభ్యులు నగేష్, మావురపు గంగారాం, పాన్సరి రామాగౌడ్, దన్నూర్ సాయిలు, సాయిలు, పెద్ద గంగారాం, సురేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో పూజలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు19: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మార్కండేయ ఆలయంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శేఖర్, పద్మశాలి సంఘం సభ్యులు గంగాధర్, భూపతి, ప్రసాద్, రామచందర్, స్వామి, మధు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : వేల్పూర్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం జంధ్యాల పుణ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని కుల సంఘ సభ్యులు మార్కండేయునికి పూజలు చేసిన అనంతరం నూతన జంధ్యాలను ధరించారు. సంఘం అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు దేవిరాజేందర్, కోశాధికారి బాస గంగాధర్, మార్కండేయ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎస్‌హెచ్‌వో



మాట్లాడుతున్న కమ్మర్‌పల్లి ఎస్‌హెచ్‌వో అనీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 19: పోటీపరీక్షలుకు సద్ధమవుతున్న అభ్యర్థులు సమయాన్ని వృధాకానియకుండా పరీక్షల పట్ల ప్రత్యేక దృష్టిసారిస్తు, కృషి పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కమ్మర్‌పల్లి ఎస్‌హెచ్‌వో అనీల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంతీయ ఉపా ధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వివేకానంద స్టడి హాల్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపస్ ఆధ్వర్యంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడి మెటీరియల్, స్టడి చైర్, ప్యాడ్‌లను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సదావకాశాన్ని మండలంలోని పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకుల సూచనలమేరకు అభ్యర్థులకు తమవంతు సహాయసహకరాలు అందిస్తామని హామీఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారనిమిత్తం ఉద్యమాలు సాగిస్తునే మరోవైపు భావితరాలకు ఉపయోగపడే విధంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం కమ్మర్‌పల్లి శాఖను తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అభినందించారు. ఈ సందర్భంగా స్టడీ మాల్‌ను సమకూర్చిన సరస్వతిశిషుమందిర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ మండ అధ్యక్షులు సుంకెట రవి, పిల్లి ఈశ్వరయ్య, తాపస్ మండలశాఖ అధ్యక్షుడు సల్లూరి కిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమేష్ డివిజన్ కార్యదర్శులు ఆనంద్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

మోస్రా,ఆగస్టు19: మండల కేంద్ర శివారులో మోస్రా నుంచి నిజామాబాద్, మోస్రా నుంచి గోవూర్ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేయాలని వాహనదారులకు ఇబ్బంది అవుతున్న విషయం విదితమే. కాని ప్రస్తుత సమస్యలు పరిష్కారం చేసేందుకు కంకర రాళ్లు, చిప్స్ వేసి గుంతలు కొంత మేర పూడ్చారు మరి కొంత మేర పూడ్చడం మరిచారు. ఇదీ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు. ఇంతకు ముందు గత నెలలో వేసిన ఇలాంటి కంకర చిప్స్ గుంతలో నిలవక పోగా మళ్లీ ఇవ్వే రాళ్లు వేయడం హాస్యాస్పదంగా ఉందని ఫోర్ వీల్స్ వాహనదారులు అంటున్నారు. అంతే కాక రాత్రి వేళల్లో గుంతల్లో వాహనం పడితే బోల్తా పడే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు.ఈ విషయమై ఏఈ జియాన్ మాట్లాడుతూ సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయాలని తెలిపాము. కాంట్రాక్టర్ చేస్తాము అని తెలిపారు. ప్రస్తుత సమస్య పరిష్కారం కోసం కంకర చిప్స్ వేసి గుంతలు పూడ్చివేస్తున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినికి అభినందనలు

నవీపేట, ఆగస్టు19: ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మండలంలోని జడ్పీహెచ్ఎస్ బినోలలో 10వ తరగతి చదువుతున్న కే.భవాని పాల్గొన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన ప్రేరణ అనే కార్యక్రమంలో పాల్గొని జిల్లా నుంచి ఆమె ఒక్కరే ఈ వేడుకలలో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. వేడుకలలో పాల్గొన్న భవాని సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఆమె కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిశారు. ఈ మేరకు కలెక్టర్ భవానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయిన మోహన్ రెడ్డి, ఉపాధ్యాయురాలు సరిత, తదితరులున్నారు.

ద్విచక్రవాహనదారులు
హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కోటగిరి,ఆగస్టు19: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని కోటగిరి ఎస్ఐ సందీప్ సూచించారు. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో సోమవారం హెల్మెట్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ఉంటే ప్రాణపాయం తప్పుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలకు తప్పనిసరి నెంబర్ ప్లేట్‌లు ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది ధర్మేందర్, సంతోష్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవీపేట, ఆగస్టు 19 : మండలంలోని శివతండాకు చెందిన నునావత్ లాలు అనే 32సంవత్సరాల వయసు గల వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 17న రాత్రి తన భార్యతో గొడవ పడి మద్యం మత్తులో బయటకు వెళ్లాడని అతని కోసం కుటుంబ సభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదని అన్నారు. భార్య నునావత్ బుజ్జి ఫిర్యాదు మేరకు సోమవారం అదృశ్యం కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

తొర్లికొండలో ఘనంగా ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు19: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఉంజల సేవ కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఉంజాల సేవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుప్రభత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు భక్తులు, తొర్లికొండ గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,ఆగస్టు19: శ్రావణ మాస ఉపాకర్మ కార్యక్రమాన్ని సోమవారం బ్రహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో వేద పండితులు అనంత జోషి, కృష్ణ జోషి మంత్రోచ్ఛరణల మధ్య శ్రావణ మాస ఉపాకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మణ్ సమాజ్ అధ్యక్షులు ప్రవీణ్ మహరాజ్, ఉమానంద్ వైద్య, మనోజ్ వైద్యరాం శాస్త్రీ, సునీల్ భాస్కర చార్య, బ్రాహ్మణులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతిచెందిన మహిళ

ఎల్లారెడ్డి, ఆగస్టు 19 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కట్టకింది తండాకు చెందిన కేస్లీ బాయి (60) కడుపు నొప్పితో బాధపడుతూ ఈనెల 12వ తేదీన సాయంత్రం వైద్యం కోసం ఆసుపత్రిలో చేరింది. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించగా కడుపులో కణితి ఉందని తేలింది. కుటుంబసభ్యుల కోరిక మేరకు వైద్యులు ఆపరేషన్ చేసి కణతిని తొలగించారు. ఆపరేషన్ చేసిన ఆరు రోజులు తరువాత సోమవారం మహిళ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మహిళ మృతిచెందిందని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆసు పత్రి వద్ద వైద్యులతో ఆగ్రహంతో వాగ్వాదానికి దిగి ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై డాక్టర్ వివరణ కోరగా వైద్యసేవలు యథావిధిగా అందించామని, కాని హార్ట్‌స్ట్రోక్‌తో మృతి చెందినట్లు తెలిపారు.

కొవ్వొత్తులతో నివాళి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 19: పశ్చిమ బెంగల్‌లోని కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న పీడీ మెడికల్ విద్యార్థినిపై లైగికదాడికి పాల్పడి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కమ్మర్‌పల్లి యువకులు డిమాండ్ చేశారు. ఈ మెరకు సోమవారం రాత్రి స్థానిక భరతమాత విగ్రహంవద్ద కొవోత్తులతో ఘనంగ నివాళులర్పించారు. ఈలాంటిఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రాయువత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలి

నవీపేట,ఆగస్టు19: మండల కేంద్రంలోని బాసర రోడ్డు వద్ద సోమవారం పోలీసులు ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్‌లు వాహనాలు నడిపితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

బోధన్‌రూరల్,ఆగస్టు19: బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి చౌరస్తాలో గల సూపర్‌మార్కెట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ ఘటన చోటు చేసుకుంది. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సూపర్‌మార్కెట్‌పైన రేకులను తొలగించి పీఓపీ కట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారని, దుకాణంలో రూ.15లక్షల అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వరుసగా బ్యాంకు సెలవులు రావడంతో డబ్బులు షాపులో ఉంచినట్లు యాజమాని పేర్కొన్నారు. పట్టణ సీఐ వీరయ్య సూపర్‌మార్కెట్ పరిశీలించి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీల ద్వారా త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

హెల్మెట్ ధరించని వారికి రాఖీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు19: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి రాఖీలను కట్టారు. కాలనీలోని యువతులు, చిన్నారులు ద్విచక్ర వాహ నాలు నడుపుతున్న వారికి హెల్మెట్ ధరించాలని, కారును నడిపేవారికి సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని వారు సూచించారు. హెల్మెట్ లేని వారికి హెల్మెట్‌లను అందజేశారు.

ఘనంగా రక్షాబంధన్



తమ్ముడికి రాఖీ కడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం సతీమణి



సోదరునికి రాఖీ కడుతున్న సోదరి



కానిస్టేబుల్‌కు రాఖీ కడుతున్న ఏఎస్‌ఐ,



అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు

సదాశివనగర్ ఆగస్టు 19 : : మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో రాఖీపౌర్ణమి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు కట్టుకున్నారు. మండల పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ ప్రమీల కానిస్టేబుల్‌కు రాఖీ కట్టిపండుగ శుభాకాంక్షలు తెలిపారు.

గాంధారి : మండలంలో రాఖీపండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నచెల్లెల అనుబంధానికి ప్రతికగా రాఖీలను సోదరులకు సోదరిమణులు కట్టారు. మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు.

పిట్లం : మండలంలో సోమవారం రాఖీ పండగ సందర్భంగా అన్నదమ్ములకు అక్కచెల్లెలు రాఖీ కట్టారు. రాఖీ పండగతో ఇంటింటా ఆడపడుచులు రావడంతో కన్నుల పండుగా రాఖీ వేడుకలు జరుపుకున్నారు. అక్కాచెల్లులు, అన్నదమ్ములకు రాఖీ కట్టారు.

బాన్సువాడటౌన్ : బాన్సువాడ పట్టణ ప్రజలు సోమవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇళ్లలో ప్రత్యేక పూజలు చేపట్టారు. నూతన వస్త్రాలు ధరించి అక్కాతమ్ముడికి, చెల్లి అన్నయ్యకు రాఖీ కట్టారు. నాకు నీవు రక్షా, నేను నీకు రక్షా , మనిద్దరం దేశానికి రక్ష అంటూ ఒకరికొకరు పండుగ మిఠాయిలు తినిపించుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ స్పీకర్ , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి పుష్ప తన తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కట్టి ఆశీర్వదించారు.

మద్నూర్ : ఉమ్మడి మద్నూర్ మండలంలో సోమవారం సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా వారి బాంధవ్యం కలకాలం నిలవాలని రక్షాబంధన్ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. అన్నకు చెల్లి అండగా, చెల్లికి అన్న తోడుగా జీవితాంతం ఉంటామని భరోసా ఇచ్చే పండుగ భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దూర ప్రాంతాలలో ఉన్న అక్క చెల్లెలు తమ అన్నతమ్ముళ్ళకు రాఖీలు కట్టడానికి వచ్చారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన రాఖీలను తమ అన్నదమ్ముళ్ళకు కట్టడానికి వచ్చారు. రాఖీలు కట్టిన సోదరీమణులకు కానుకలు ఇచ్చారు. మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో రాఖీపూర్ణిమ సందర్భంగా భక్తులకు సంతోషి అమ్మవారు రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధన్ రోజే సంతోషిమాత పుట్టిన రోజు కావడంతో భక్తులు తరలి వచ్చి రాఖీలను కట్టుకున్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో సోమవారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు అక్కాచెల్లెలు అన్నదమ్ముళ్ళకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకున్నారు. అన్నతమ్ముళ్ళ, అక్కాచెల్లెళ్ళ అనుబంధం జీవితాంతం కొనసాగాలని ఆకాంక్షించారు.

భిక్కనూరు : రక్షాబంధన్ వేడుకలను భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి మహిళలు సోదరులకు రాఖీలు కట్టి హారతులు ఇచ్చి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా సోదరులు అక్క, చెల్లెళ్లకు బహుమతులను అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు మండల ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు తన సోదరీమణులు రాఖీ కట్టగా, సచివాలయంలో మంత్రి సీతక్క భిక్కనూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డికి రాఖీ కట్టారు.

మనందరం దేశానికి రక్ష.. ఎస్సై

దోమకొండ :మండల కేంద్రంలోని గుండ్ల చెరువు సమీపంలో గల సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం ఎస్సై ఆంజనేయులు విద్యార్థులతో రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాఖీ పండగను విద్యార్థులతో కలసి చేసుకోవడానికి గురుకుల పాఠశాలకు రావడం జరిగిందన్నారు. మేము మీకు రక్ష మీరు మాకు రక్ష మనందరం దేశానికి రక్ష అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. తల్లి దండ్రులను, గురువులను, తోటి వారిని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు. దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రెండు మండలాల్లోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తోబుట్టువులు తమ వారికి రాఖీలు కట్టేందుకు రావడంతో మండలాల్లో సందడి వాతావరణం నెలకొంది. అన్న చెల్లెలు, చిన్నారులు రాఖీ పండగను ఘనంగా జరుపుకున్నారు.



భీంరెడ్డికి రాఖీ కడుతున్న సీతక్క



ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాలలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



ఎస్సై, ఏఎస్సైకి రాఖీలు కడుతున్న విద్యార్థులు

భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్షలు



కార్మికులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 19 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం భవన ఇతర నిర్మాణ రంగాల కార్మికులకు, కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహించారు. 20 మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కార్మికులకు ఆరోగ్య సమస్యలు తేలితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, నారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ కరువు



మొక్కలను తింటున్న మేకలు

గాంధారి, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని కామారెడ్డి-బాన్సువాడ ప్రధానరహదారి మధ్యలో గ్రామ సచివాలయ ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతుంది. ఇటీవల కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పర్యటన సందర్భంగా డివైడర్ మధ్యలో మొక్కలు నాటాలని సూచించడంతో అధికారులు మొక్కలను నాటారు. కాని వాటి సంరక్షణకు మాత్రం చర్యలు తీసుకోకపోవడంతో పశువులు, మేకల పాలవుతున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది మొక్కలను నాశనం చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీలకు పాలకవర్గకాల పరిమితి ముగిసిపోగా, ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. కాని గ్రామపంచాయతీలలో పనిచేసే ఆపరేటర్‌తో సహా ఇతర సిబ్బంది ఎవరికి నచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మొక్కలను సంరక్షించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి



శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భిక్కనూరు, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో శ్రావణమాస సోమవారం సందర్భంగా భక్తుల తాకిడి నెలకొంది. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాస ప్రత్యేకపూజల్లో బాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మార్కండేయ మందిరంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

దోమకొండ, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా భద్రావతి-భవనాబుషల కల్యాణం శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు నిర్వహించారు. ఉదయం 7.15కు మార్కండేయ సమేత ఉమామహేశ్వరులకు కుంభాభిషేకం, 8.15కు గణపతి పూజ, అఖండ దీపారాధాన, 9.15కు ధ్వజారోహణ, 9.30కు తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 4.15కు శ్రీ ఉమామహేశ్వరుల, మార్కండేయ స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు.. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు పద్మశాలి సంఘం సభ్యులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో భారీ వర్షం



బీర్కూర్‌లో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం

బీర్కూర్, ఆగస్టు 19 : మూడు, నాలుగు రోజులుగా ఉక్కపోతతో మండల ప్రజలు సతమతమవుతున్నారు. సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో మండల ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. రైతులు ఆనందం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా బీర్కూర్‌లో ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వర్షానికి రహదారిపై వర్షం నీరు నిలిచింది. పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో వృక్షబంధన్

భిక్కనూరు, ఆగస్టు 19 : మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాం పస్‌లో సోమవారం వృక్షబంధన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఆవరణలోని మొక్కలకు అధ్యాపకులు, విద్యార్థులు రాఖీ కట్టారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఈ భూమి మనుగడ పర్యావరణంతో ముడిపడి ఉందని, ప్రతిఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. సౌత్‌క్యాంపస్‌లో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పిలుపు మేరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాలాద్రి, నారాయణ, అంజయ్య, ప్రతిజ్ఞ, మోహ న్‌బాబు, ఆకో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

పీఎం అజయ్ పథకానికి లబ్ధిదారుల ఎంపిక

మద్నూర్, ఆగస్టు 19 : ఉమ్మడి మద్నూర్ మండలంలో పీఎం అజయ్ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఈనెల 21న మద్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. ఈ పథకం కింద చేపల పెంపకం చేయుటకు ఎస్సీ లబ్ధిదారులకు ఉమ్మడిగా గుర్తించడానికి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వివాదాస్పద పోస్టులు పెడితే కేసులు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 19 : సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే, వివాదాస్పద పోస్టులు పెడితే కేసులు నమోదుచేస్తామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా సోషల్‌మీడియాలో కుల, మతాలకు సంబంధించిన విషయాలను, ఏదో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తు అవమానపరిచే విధంగా, వ్యక్తిని టార్గెట్ చేసే విధంగా కొంతమంది ఫొటోలను, మెసేజ్‌లను, వీడియోలను పోస్టు చేస్తున్నారని అన్నారు. ఇతరుల ఆత్మగౌరవాలను దెబ్బ తిసేవిధంగా వ్యవహరిస్తే కేసులు తప్పవన్నారు.

సంతోషిమాతా జన్మదినోత్సవం



ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఆగస్టు 19 : పట్టణంలోని భక్తులు సోమవారం శ్రీ సంతోషిమాతా ఆలయంలో అమ్మవారి జన్మదినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి అమ్మవారి మూల విరాట్టుకు సుప్రభాత సేవ , అభిషేకం, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. వేద మంత్రాలతో హోమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో అర్చకులు పురుషోత్తమశర్మ , అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి , సంతోష్ కుమార్ , భక్తులున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

భిక్కనూరు, ఆగస్టు 19 : పదోతరగతి పరీక్షల్లో ఉత్త మ ప్రతిభ కనబరిచిన పద్మశాలీ విద్యార్థులు కుర్రి స్నేహిత, జోగ్రిగల భావనకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం జంద్యాల పౌర్ణమిని పురస్కరించుకుని యజ్ఞోపవీతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమ కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. అనంతరం జంద్యాలను సంఘం సభ్యులు మార్చుకున్నారు. కాగా గత కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుర్రి కృష్ణమూర్తి, తాటిపా ములు లింబాద్రి, రాజయ్య, తడక వీరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

భవనాల నిధులను ఉపసంహరించండి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- పీఆర్‌టీయూకే కేటాయించడంపై ఆగ్రహం

కామారెడ్డిటౌన్, ఆగస్టు 19 : పీఆర్‌టీయూ సంఘ భవనాలకు ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి కేటాయించిన నిధులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయసంఘం, టీపీటీఎఫ్, టీపీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 18న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన పీఆర్‌టీయూ సర్వసభ్యసమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి తమ ఎమ్మెల్సీ నిధుల నుంచి భిక్కనూర్ పీఆర్‌టీయూ భవనంకు రూ.10 లక్షలు, ఎల్లారెడ్డి పీఆర్‌టీయూ భవనంకు రూ.10 లక్షలు, కామారెడ్డి పీఆర్‌టీయూ భవనంకు రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఇది ఏ రకంగా సమాంజసమని ఉపాధ్యాయుల పక్షాన గెలిచిన ఎమ్మెల్సీ ప్రభుత్వ నిధులను ఒక యూనియన్ భవనాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పాఠశాలలు సరైన మౌలిక సదుపాయాలు లేక కొట్టుమిట్టాడుతుంటే పాఠశాలలకు కేటాయించకుండా యూనియన్ సంఘభవనాలకు కేటాయించడం శోచనీయమన్నారు. అదే 25 లక్షల ప్రభుత్వ పాఠశాలలకు కేటాయిస్తే ఆ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎమ్మెల్సీగా గెలిచి ఆరు సంవత్సరాలలో కనీసం ఒక్క పాఠశాలను సందర్శించి ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ప్రభుత్వంతో చర్చించిన పాపాన పోలేదన్నారు. ఇప్పుడేమో అప్పనంగా నిధులు సంఘభవనాలకు కేటాయించాడన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్, కోశాధికారి సంగయ్య, రాజన్న, టీపీఆర్‌టీయూ ప్రధానకార్యదర్శి లక్ష్మీరాజం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

రుణమాఫీ కాలేదని రైతుల ఆగ్రహం



ధర్నా చేస్తున్న రైతులు

పిట్లం, ఆగస్ట్ 19 : మండలంలోని రాంపూర్ గ్రామంలో గల గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంక్ ఎదుట బైఠాయించి. సోమవారం గ్రామీణ బ్యాంక్ ఎదుట బ్యాంక్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై నినాదాలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిల బెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ మాఫీ చేయా లని, లేని పక్షంలో భారీఎత్తున బ్యాంక్ ఎదుట నిరసన చేపడతామన్నారు. నిరసన కార్యక్రమం లో మాజీసర్పంచ్ నారాయణ రెడ్డి, రైతులు శ్రావన్, శంకర్, ఎల్లయ్య, సాయిలు, నాగరాజు, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70	- తంగలన్
ప్రియా 35	- సరకాతి కా అటాంక్

బాన్సువాడ

మహేశ్వరి	- మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	- డబుల్ ఇస్మార్ట్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	170	160	190

